TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 36 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శనివారం.30.08.2025 పేజీలు : 8, వెల:రూ.2.00




## విద్యాసంస్థల్లో ముఖం చూపాల్సిందే



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: పాఠశాలలు మొదలు విశ్వవిద్యాలయాల వరకు ప్రతి విద్యాసంస్థలోనూ మెరుగైన బోధన సాగాలనీ, విద్యా బోధనలో నాణ్యతా ప్రమాణాలు మరింత పెంచాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, వృత్తి విద్యా కోర్సులు బోధించే కాలేజీల్లో విద్యార్థులు, బోధనా సిబ్బందికి ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ (ఎఫ్ఆర్ఎస్) తప్పనిసరి చేయాలన్నారు. ముఖ గుర్తింపుతో హాజరు శాతం మెరుగవడంతోపాటు వృత్తి విద్యా సంస్థల్లో లోటుపాట్లను అరికట్టవచ్చని అన్నారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. విద్యాశాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణం వివిధ విభాగాలు చేపట్టడం సరికాదని సీఎం అభి ప్రాయపడ్డారు. ఈ నిర్మాణాల నాణ్యతా ప్రమాణాలు, వాటి పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదా రీతనానికిగానూ ఒకే విభాగం కింద ఉండాలని సూచించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ (టీజీఈడబ్ల్యూఐడీసీ) కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల నిర్మాణాలూ కొనసాగాలని సీఎం ఆదేశించారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి వెంటనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్‌చానల్ ద్వారా చేపట్టాలనీ, ఈ విషయంలో ఎటువంటి అలసత్వం చూపొద్దని సీఎం అన్నారు.

కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలి

రాష్ట్రంలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కంటైనర్లపైన సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్‌ను వినియోగించుకోవచ్చని కోరారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని సీఎం కోరారు. సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని బాలికలకు వివిధ అంశాలపై కౌన్సిలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సిలర్లను నియమించాలని సూచించారు. విద్యారంగంపై పెడుతున్న ఖర్చును తాము ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూస్తున్నామని చెప్పారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో 90 శాతం ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ విద్యార్థులే

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లతోపాటు విద్యారంగం అభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారని సీఎం వివరించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికిపైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే ఉన్నారని చెప్పారు. ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేండ్లలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి అజిత్‌రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ సంచాలకులు ఈ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స మధ్యలో రోగులను డిశ్చార్జి చేస్తే కఠిన చర్యలు




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఆపరేషన్ల తర్వాత, చికిత్స మధ్యలో పేషెంట్లను డిశ్చార్జి చేస్తున్న ప్రయివేటు, కార్పొరేట్ హాస్పిటల్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, ఉన్నతాధికారులతో కలిసి హాస్పిటల్‌లో అందుతున్న సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గాంధీ, ఉస్మానియా, నిమ్స్, ఇతర ప్రభుత్వాస్పత్రుల ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ల నడుమ సమన్వయం ఉండాలని సూచించారు. ఒక ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో బెడ్లు నిండినపుడు, పేషెంట్‌ను మరో ఆస్పత్రికి రిఫర్ చేసి అక్కడ అడ్మిట్ చేసుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. పేషెంట్‌ను రిఫర్ చేయడానికి ముందే అవసరమైన ప్రాథమిక చికిత్స అందించి, స్టేబుల్ చేయాలని ఆదేశించారు. పేషెంట్ ఆస్పత్రి మార్పు సమయంలో అవసరాన్ని బట్టి అంబులెన్స్‌లో ఒక డాక్టర్‌ను పంపించాలని మంత్రి సూచించారు. పేషెంట్ల అడ్మిషన్, రిఫరల్ విషయంలో డ్యూటీ డాక్టర్లు, ఆర్ఎంఓలు నిర్లక్ష్యంగా వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

నిమ్స్ ఎమర్జెన్సీకి నేరుగా వచ్చే పేషెంట్లకు, ప్రభుత్వాస్పత్రుల నుంచి రిఫరల్‌పై వచ్చే వారికి అధిక ప్రాధాన్యతనివ్వాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ప్రయివేటు, కార్పొరేట్ హాస్పిటల్స్ నుంచి వచ్చే పేషెంట్ల విషయంలోనూ సానుభూతితో వ్యవహరించి చికిత్స అందించాలన్నారు. ఈ ఏడాది వందకుపైగా కిడ్నీ ఆపరేషన్లు చేసినందుకు నిమ్స్ డైరెక్టర్, డాక్టర్లు, సిబ్బందిని మంత్రి అభినందించారు.

అంతకుముందు డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ ఈ ఏడాది తొలి ఏడు నెలల్లో 5.44 లక్షల మందికి వైద్యసేవలందించగా, అందులో సగం మంది ఆరోగ్యశ్రీ, ఈజేహెచ్ఎస్ పథకాల పరిధిలోని వారున్నట్టు తెలిపారు. ప్రతి రోజు ఎమర్జెన్సీకి 80 నుంచి వంద మంది రోగులు వస్తున్నారనీ, ఇందులో సగం మందికిపైగా ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొంది, పరిస్థితి విషమించాక చివరి నిమిషంలో నిమ్స్‌కి వస్తున్నారని ఆయన తెలిపారు. కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులు ఆపరేషన్లు చేసి పేషెంట్లు పూర్తిగా కోలుకోకముందే డిశ్చార్జ్ చేసి నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు పంపిస్తున్నారని బీరప్ప వివరించారు. ఇలాంటి కేసులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ వాణి, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజారావు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో వచ్చే మూడ్రోజులు వానలు



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో వచ్చే మూడ్రోజులు వర్షాలు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. ఆ జాబితాలో హైదరాబాద్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, కొమ్రంభీం అసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, ములుగు, నాగర్‌కర్నూల్, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్, యాదాద్రిభువనగిరి, ఖమ్మం, నల్లగొండ జిల్లాలున్నాయి. పలు జిల్లాల్లో బలమైన ఉపరిత గాలులు వీచే అవకాశముంది. శుక్రవారం రాత్రి పది గంటల వరకు రాష్ట్రంలో 307 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కర్కగూడెం, ఆదిలాబాద్ మాల్వా మండలం రాంనగర్‌లో అత్యధికంగా 3.4 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.

## మేడారం జాతర పనులను సకాలంలో పూర్తి చేయాలి



ములుగు :అమృత్ తెలంగాణ: జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న మేడారం మహా జాతర అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళాశిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. పనుల్లో నాణ్యత పాటించి శాశ్వతంగా నిలిచిపోయేలా ఉండాలన్నారు. ములుగు జిల్లా మేడారంలోని ఐటీడీఏ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, ఐటీడీఏ పీఓ చిత్రమిశ్రాతో కలిసి పూజారులు, వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సాయంత్రం మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పనులు, మాస్టర్ ప్లాన్ రీ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను ఆర్కియాలజిస్ట్, వివిధ శాఖల అధికారులు ఏఏ దశల్లో ఉన్నాయో మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. జాతర లోపు మొదటి విడత పనులను పూర్తి చేయాలన్నారు. గద్దల ప్రాంగణం విస్తరణ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెల స్థలం మార్పులు, లైన్‌ల విస్తరణ, నూతన మీడియా పాయింట్ భవనం, ముఖ్యమంత్రి అతిథి భవనం, పూజారుల వసతి భవనం తదితర నిర్మాణాలకు త్వరితగతిన టెండర్లు పూర్తి చేయాలన్నారు. గద్దెలను వరుస క్రమంలో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గరావు, ఈఓ వీరస్వామి, ఇంజినీరింగ్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కదిలిస్తే కన్నీరే... కామారెడ్డిలో ప్రజల దీనస్థితి

నిజామాబాద్ : అమృత్ తెలంగాణ: ఏకధాటిగా కురిసిన భారీ వర్షంతో తొలుత ఇంటి గేటు వరకు వరద నీరు వచ్చింది. ఆ తర్వాత గడపదాటి ప్రవాహం ఇంట్లోకి పెరిగిపోవడంతో దిక్కుతోచని పరిస్థితి. ఇండ్లల్లోకి నడుము లోతు నీరు రావడంతో బయటకు వెళ్లే పరిస్థితి లేక పలువురు సెల్ఫ్‌లు ఎక్కి తమ ప్రాణాలను రక్షించుకోగా.. మరికొంత మంది పక్కనే ఉన్న ఎత్తైన భవనాల్లోకి వెళ్లారు. భవనమెత్తు నీరు. చుట్టు చిమ్మ చీకటి. అలానే బిక్కుబిక్కుమంటు దాదాపు పది గంటల పాటు నరకయాతన. ఆ సమయంలో అధికారులు కానీ ఇటు ఎమ్మెల్యే కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. సహాయం గురించి మాట్లాడుతున్న బీజేపీ నేతలు, కేంద్రసాయం గురించి మాటమాత్రమైనా ప్రస్తావించలేదు. బాధితులను పలకరించి మాట్లాడిస్తే కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇంతటి వరదను తాము గతంలో ఎన్నడూ చూడలేదని.. భవనమెత్తు నీరు రావడంతో తాము బతుకుతామని అనుకోలేదని నవతెలంగాణ బృందం వెళ్లి పలకరించినప్పుడు ఉబికి వచ్చిన కన్నీటితో కుమిలిపోతున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో వరదలతో బీఆర్ కాలనీతో పాటు హౌజింగ్‌బోర్డు కాలనీల్లో బాధిత కుటుంబాల దీనావస్థపై ప్రత్యేక కథనం.

ఉప్పొంగిన పెద్ద చెరువు..

కామారెడ్డి జిల్లా కేంద్రంలో కురిసిన కుంభవృష్టితో శివారులో ఉన్న పెద్దచెరువు ఉప్పొంగింది. భారీ వర్షంతో కాలువలు ఉధృతంగా ప్రవహించాయి. పట్టణంలోని బీఆర్ కాలనీతో పాటు హౌజింగ్ బోర్డు కాలనీలు నీట మునిగాయి. భవనం ఎత్తు నీరు రావడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గడిపారు. బుధవారం తెల్లవారు జామున 5 గంటలకు వర్షం ప్రారంభం కాగా.. 11 గంటల నుంచి 12 గంటల వరకు వరద నీరు ఇండ్లను ముంచెత్తింది. ఒక అంతస్తు భవనం వరకు నీట మునిగింది. రాత్రి 10 గంటల వరకు వరద ప్రవాహం ఇండ్లల్లో ఉండిపోయింది.

బతుకుతామని అనుకోలే..

చాకలి లింగం తన భార్య, వికలాంగురాలైన కూతురుతో బీఆర్ కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. వరద ఇంటిని ముంచెత్తడంతో ఎటు వెళ్లలేని పరిస్థితి. మంచం మీద



కూర్చుందామనుకుంటే మంచం సైతం నీటిలో ఉండిపోయింది. ప్రవాహం మరింత పెరగడంతో అతికష్టం మీద ముగ్గురు కలిసి పై సెల్ఫ్ మీదకు ఎక్కి కూర్చున్నారు. చుట్టుపక్కల వారికి, బంధువులకు ఫోన్ చేసినా ఎవరూ వచ్చి కాపాడలేని నిస్సహాయత. పది గంటల పాటు బిక్కుబిక్కుమంటూ అలానే గడిపారు. వరద తగ్గడంతో ఊపిరిపీల్చుకున్నారు. వారిని పలకరిస్తే బతుకుతామని అనుకోలేదని కన్నీరు పెట్టుకుంటున్నారు.

రూపాయిరూపాయి కూడబెట్టుకొని..

కిరాయి ఉండే రాజు కుటుంబం రూపాయి రూపాయి కూడబెట్టుకుంటూ ఇంట్లో టీవీ, కూలర్, సోఫా, ఫ్రిడ్జ్ ఇతరత్రా వస్తువులు కొనుగోలు చేస్తే.. ఇంటిని వరద ముంచెత్తడంతో అవన్నీ పనికిరాకుండా పోయాయి. వరద వస్తుంటే కట్టుబట్టలతో పక్కనే ఉన్న రెండంతస్తుల భవనంపైకి వెళ్లి రక్షణ పొందారు. కానీ అక్కడ తినేందుకు, తాగేందుకు ఏమీ లేకపోవడంతో అతికష్టం మీద ట్యాంక్ లోని నీళ్లను తీసుకొని వేడి చేసుకొని తాగి పది గంటల పాటు అక్కడే గడిపారు. మెకానిక్‌గా పని చేస్తూ కారును కిరాయికి ఇస్తూ జీవనం పొందుతుండగా.. వరదలతో కారు కొట్టుకుపోయింది. జీవనాధారం కోల్పోగా.. ఇంట్లోని వస్తువులన్నీ పాడైపోవడంతో సుమారు 10 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్టు వాపోతున్నారు. ఇలా పలకరించిన ప్రతి కుటుంబానిది కన్నీటి వ్యథలే వినిపిం చాయి. బీఆర్ కాలనీలో 30 కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వందలాది కుటుంబాలు వరద తాకిడికి లోనయ్యాయి.

## నేడు హైదరాబాద్‌లో సురవరం సంస్మరణ సభ



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ శనివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరగనుంది. ఈ మేరకు సీపీఐ కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 23న సురవరం సుధాకర్‌రెడ్డి మరణించిన విషయం తెలిసిందే. ఈ సంస్మరణ సభకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హిమాచల్‌ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, రాష్ట్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీలు, వామపక్ష పార్టీల నాయకులు, మేధావులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీపీఐ శ్రేణులు,శ్రేయోభిలాషులుఈ సభలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## వేల ఎకరాల్లో నీట మునిగిన పంటలు

అమృత్ తెలంగాణ: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాలు, వరద ప్రభావానికి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మంచిర్యాల జిల్లాలోని గోదారి పరివాహక ప్రాంతాలైన జన్నారం, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో వివిధ పంటలు వేల ఎకరాల్లో నీట మునిగాయి. పలు గ్రామాల్లో పొలాల్లో ఇసుక మేటలు వేయగా, రోడ్లు భారీగా కోతకు గురయ్యాయి. జైపూర్ మండలంలో వేలాల, కిష్టాపూర్, పౌనూర్, శివ్వారం గ్రామాల్లో సుమారు 600 ఎకరాల పంటలు గోదావరి వరద ఉధృతికి నీట మునిగాయి. కుమురంభీం–ఆసిఫాబాద్ జిల్లాలోని కౌటాల, దహెగాం, బెజ్జూర్, చింతలమానేపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో పంటపొలాలను ప్రాణహిత బ్యాక్ వాటర్ ముంచెత్తింది. నిర్మల్ జిల్లాలో వరద ఉధృతికి ఆస్తి నష్టంతోపాటు పంటలు, రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. బాసర మండలంలో గోదావరి పరివాహక ప్రాంతంలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. శుక్రవారం ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్, నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ భైంసా పట్టణంలోని రావుల్‌నగర్, ఆటోనగర్, దేగామ వంతెన, కుంటాల మండలంలోని అందకూరు బ్రిడ్జిని పరిశీలించారు. ఆదిలాబాద్ జిల్లాలోని పెన్‌గంగ పరివాహక ప్రాంతాలైన తాంసి, భీంపూర్, జైనథ్, బేల, భోరజ్ మండలాల్లో పంటలు నీట మునిగాయి.

# నీటి గుంతలో పడి బాలుడు మృతి



మృతి చెందిన కుంట దినేష్

జగిత్యాల రూరల్ అమృత్ తెలంగాణ ఆగస్టు 29 జగిత్యాల జిల్లా రూరల్ మండలం కల్లెడ గ్రామంలో గురువారం విషాదకర సంఘటన చోటుచేసుకుంది. పాఠశాలకు సెలవు రావడంతో ఇంటి వద్ద ఆడుకుంటున్న ఏడేళ్ల కుంట దినేష్ అనే బాలుడు నీటి గుంతలో పడి మృతి చెందాడు. రెండో తరగతి చదువుతున్న దినేష్, మరో ముగ్గురు చిన్నారులతో ఆడుకుంటూ ఉండగా ప్రమాదవశాత్తు గుంతలో పడిపోయాడు. స్థానికులు గమనించి చాలా సేపు వెతికినా అప్పటికే బాలుడు మరణించాడు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం



టీ షర్టు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మెట్టుపల్లి అమృత్ తెలంగాణ ఆగస్టు 29 మెట్ పల్లి పట్టణంలో లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఈరోజు నేషనల్ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లయన్స్ అధ్యక్షులు వెల్ములు శ్రీనివాస్ రావు విద్యార్థులకు స్పోర్ట్స్ టీ షర్టులు విద్యార్థిని విద్యార్థులకు అందించారు లయన్స్ క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ క్రీడా దినోత్సవ పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఈ కార్యక్రం క్రీడాలను ప్రోత్సహించడం కొరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు .ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్ములశ్రీనివాసరావు. క్యాషియర్ వేములవాడ చంద్రశేఖర్ .ఆత్రౌండర్ గంగాధర్ వసతి విద్యార్థినిలు పాల్గొన్నారు

# జగిత్యాలలో మజీద్ అభివృద్ధి కోసం నిధులు మంజూరు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అమృత్ తెలంగాణ ఆగస్టు 29 పట్టణంలోని కొత్త బస్ స్టాండ్ వద్ద గల జలీలి మజీద్ అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శుక్రవారం 3,71,692 రూపాయల విలువైన చెక్కును మజీద్ కమిటీ సభ్యులకు అందజేశారు. గతంలో ఈ పనులకు 4 లక్షల రూపాయలు మంజూరు చేయబడ్డాయి. ఈ కార్యక్రమంలో మైనార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, సుల్తాన్ ఉద్దీన్ అహ్మద్, మాజీ వైస్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రమాదంలో చనిపోయిన విద్యుత్ ఉద్యోగి, కుటుంబానికి న్యాయం చేయండి అని వినతి



డిఈకి వినతి పత్రం అందజేస్తున్న కుటుంబ సభ్యులు

మెట్ పల్లి అమృత్ తెలంగాణ ఆగస్టు 29 పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో శుక్రవారం, విద్యుత్ ప్రమాదంలో మరణించిన తాత్కాలిక ఉద్యోగి సంబారి హరీష్ కుటుంబ సభ్యులు, ఆయన భార్యకు ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ విద్యుత్ శాఖ డిఈకి వినతిపత్రం అందించారు. మూడు నెలల క్రితం జరిగిన ఈ ప్రమాదంలో హరీష్ మరణించారని, తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడి తల్లిదండ్రులు సాంబరి చంద్రశేఖర్, భులక్ష్మి దంపతులు, ఇతర కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తానని డిఈ హామీ ఇచ్చారు.

# సెర్ఫ్ సిబ్బంది బదిలీలు

అమృత్ తెలంగాణ: రాజన్న సిరిసిల్ల రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేశారు. జిల్లాలోని ఎల్ 2, ఎల్ 1, ఎంఎస్ సీసీఎస్ 53 మంది ఉ ద్యోగులకు శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కౌన్సిలింగ్ నిర్వహించి, బదిలీ చేశారు. కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి,,అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల సీఈఓ ల బదిలీలు




ఇబ్రహీంపట్నం అమృత తెలంగాణ 29 ఆగస్టు: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని సహకార సంఘం సీఈవోలు శుక్రవారం బదిలీ అయ్యారు ఇబ్రహీంపట్నం సహకార సంఘం సీఈవో సతీష్ కుమార్ భూషణరావుపేటకు యామాపూర్ సీఈవో నేమూరి మహేందర్ నందగిరి సహకార సంఘానికి ,తిమ్మాపూర్ సహకార సంఘం సీఈవో సంపత్ ముత్యం పేట సహకార సంఘానికి బదిలీ అయ్యారు ఈ బదిలీ ఉత్తర్వులను కరీంనగర్ జిల్లా సహకార సంఘం సీఈఓ సత్యనారాయణ జారీ చేశారు

# మెట్ పల్లి సామాజిక హాస్పత్రిని సందర్శించిన అడిషనల్ కలెక్టర్: బి ఎస్ లత



సందర్శిస్తున్న అడిషనల్ కలెక్టర్ బి ఎస్ లత

మెట్ పల్లి అమృత్ తెలంగాణ మెట్ పల్లి పట్టణంలో శుక్రవారం అడిషనల్ కలెక్టర్ బి ఎస్ లత మున్సిపల్ ప్రత్యేక అధికారి శుక్రవారం సామాజిక వైద్యశాలను సందర్శించారు. రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు, కిచెన్ రూమ్ లో వంటలను పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న వైద్యశాల పనుల పురోగతిని కూడా ఆమె అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ఎక్కువ అవుతున్నాయి కావున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు,ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ఎన్ శ్రీనివాస్, డాక్టర్ అమరేశ్వర్, మున్సిపల్ మేనేజర్ వెంకటలక్ష్మి, శానిటారు ఇన్ స్పెక్టర్ రత్నాకర్, విష్ణు, ముజీబ్ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం మండలంలో పలు గ్రామాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమం



శుభ్రం చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి గురుడు శ్రీకాంత్

ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ 29 ఆగస్టు జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదుర్, తిమ్మపుర్, యామపుర్, ఫకిర్ కోండాపుర్, వేములకుర్తి, బర్దిపుర్, ములరాంపుర్, ఎర్దండి, కోమటికోండాపుర్, వర్షకోండ, డబ్బ, ఎర్రపుర్, అమ్మకపెట్, ఇబ్రహీంపట్నం, కేశాపుర్, కోజన్ కోత్తుర్ గ్రామాలలో ప్రతి శుక్రవారం గ్రామపంచాయతి సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీలు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. నిలిచిన నీటి ప్రదేశాలలో బ్లిచింగ్ చల్లి, దోమల నివారణ చర్యలు చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని గ్రామస్తులకు సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

# పంట నష్టాన్ని పర్యవేక్షించిన వ్యవసాయ అధికారులు



పంట నష్టాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ 29 ఆగస్టు జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని కోమటి కొండాపూర్, ఎర్దండి గ్రామాలలో శుక్రవారం గోదావరి వరద ఉదృతికి దాదాపు 500 ఎకరాలలో వరి, మొక్కజొన్న, పసుపు తదితర పంటలు నీట మునిగాయి. ఎస్సారెస్పీ నుండి వస్తున్న వరద ఉదృతికి పంట పొలాలలో నీరు నిలిచిపోవడంతో ఈ నష్టం జరిగింది. మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్, ఏఈఓ రవళిక, ఏఎంసీ చైర్మన్ బోరిగాం రాజు, రైతులు కలిసి పంట పొలాలను పరిశీలించి, ప్రాథమికంగా 500 ఎకరాలుగా నష్టాన్ని అంచనా వేశారు.

# సీఎం సహాయనిధి చెక్కులు పంచిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అమృత్ తెలంగాణ ఆగస్టు 29 పట్టణంలోని పొన్నాల గార్డెన్స్ లో శుక్రవారం ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ 64 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 16, 82, 200 విలువైన చెక్కులను అందజేశారు. అలాగే, 89 మందికి కల్యాణ లక్ష్మి, షాది ముభారక్ పథకం ద్వారా మంజూరైన 89 లక్షల రూపాయల విలువైన చెక్కులను కూడా పంపిణీ చేశారు.కార్యక్రమంలో లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# ఏడాది క్రితం తప్పిపోయిన విద్యార్థి ఆస్తిపంజరమై లభ్యం!





రిశ్వంత్ ఆస్తిపంజరం,ఆదారాలు

మెట్పల్లి రూరల్ అమృత్ తెలంగాణ ఆగస్టు 29 మెట్ పల్లి రూరల్ మండలం రాజేశ్వరరావుపేటకి చెందిన విద్యార్థి నోముల రిశ్వంత్, ఏడాది క్రితం తప్పిపోయి, రెండు రోజుల క్రితం కేదార్నాథ్లో అస్థిపంజరంగా లభించడంతో గ్రామంలో విషాదం నెలకొంది. రిశ్వంత్ పంజాబ్లోని ఓయూనివర్సిటీలో బీటెక్ 4వ సంవత్సరం చదువుతున్నాడు. గతేడాది ఇంటి నుంచి కళాశాలకు వెళ్తున్నానని చెప్పి బయలుదేరాడు, కానీ కళాశాలకు చేరలేదు. అప్పుడు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి సమాచారం దొరకలేదు గత రెండురోజుల క్రితం ఆస్తి పంజరమై కనిపించాడు ఈ ఘటనకు సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం ముఖ్య అతిథులుగా ఎంపీ గెడెం నగేష్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా







అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా టిటిడి కల్యాణ మండపం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. టిటిడి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీ గేడెం నగేష్ , జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి భారత గొప్ప హాకీ క్రీడాకారుడు మెజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం క్రీడలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ గేడెం నగేష్ , కలెక్టర్ రాజర్షి షా పాల్గొని, మెజర్ ధ్యాన్ చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ క్రీడా మహోత్సవం లాగిన్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి, కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాల వలన జిల్లాలో క్రీడలకు ప్రోత్సాహం ఇచ్చే దిశగా ముందడుగు వేస్తాయని, యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు తోడ్పడతాయని , మేజర్ ధ్యాన్ చంద్ భారత హాకీ జట్లకు ఒలింపిక్స్ లో మూడు బంగారు పతకాలు అందించి దేశ ఖ్యాతిని ప్రపంచానికి పరిచయం చేశారనీ అన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 29 న జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటామని, క్రీడాకారులు ఉత్సాహంతో పాల్గొంటారని, పోటీతత్వం, సహకారం , శారీరక శ్రేయస్సు యొక్క శక్తివంతమైన జ్ఞాపకార్థం. ఈ ప్రత్యేక రోజు క్యాలెండర్లో మాత్రమే కాదు, హాకీ మైదానంలో అతని మాయ సామర్థ్యాలు ఒక దేశాన్ని మెల్కొల్పిన మేజర్ ధ్యాన్ చంద్ వారసత్వానికి సంతోషకరమైన వేడుక.అని పేర్కొన్నారు. ఈ సంవత్సరం థిమ్ జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని, 'ఏక్ గంటా, ఖేల్ కే మైదాన్ మే' (ఒక గంట, ఆట స్థలంలో) అనే థీమ్తో 'ఫిట్ ఇండియా' ఉద్యమం ల మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా కొనసాగనుంది. ఈ ఉద్యమం ఆగస్టు 31 వరకు జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో dyso శ్రీనివాస్, పార్థసారథి, అధికారులు క్రీడాకారులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లలో chalపూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మకరందు మంద అన్నారు.




అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లలో %ఎష్టుశ్రీ%పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మకరందు మంద అన్నారు. శుక్రవారం సాయంత్రం పలు జిల్లాల అదనపు కలెక్టర్లతో ఆయన స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రణాళిక పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని సదుపాయాలను సమకూర్చుకోవాలని తెలిపారు. ఇక్కడ కూడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికల నిర్వహణ చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, అధికారులంతా స్థానిక సంస్థల ఎన్నికల పకడ్బందీ ప్రణాళికలను రూపొందించాలని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన సామాగ్రి మొత్తం సరిపడినంత సమకూర్చుకోవాలని అన్నారు. ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికలను నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో గోవింద్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికల - 2025 నిర్వహణ పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు.





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు ఈ సమావేశం ఏర్పాటు చేయనైనదని, వార్డుల వారీగా, గ్రామ పంచాయితీ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు ప్రచురణ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిన్న 28.08.2025 గురువారం ఓటర్లు జాబితా, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురించడం జరిగినదని, అట్టి జాబితాలో ఏమైన అభ్యంతరాలు ఉన్నచో ఈ నెల 28 వ తేదీ నుండి 30 వ తేదీ వరకు ఎంపీడీవో కార్యాలయం లో అభ్యంతరాలను తెలపాలని, అభ్యంతరాలను స్వీకరించిన ఎంపీడీవో లు పరిశీలించి తగు సవరణలు చేసి తుది జాబితా ప్రచురణ జై జిల్లా పంచాయితీ అధికారికి సమర్పించాలని, అలాగే పోలింగ్ స్టేషన్ల జాబితా జిల్లా కలెక్టర్ కు ఆమోదం కొరకు సమర్పించాలని ఆన్నారు. తేది 02.09.225 న ఓటర్లు, పోలింగ్ తుది ముసాయిదా జాబితాను ఎంపీడీవో కార్యాలయం లో ప్రచురించబడునని తెలిపారు. మండల స్థాయి లో రేపు 30.08.225 న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ఆర్డీఓ స్రవంతి, dpo రమేష్, dlpo ఫణీంద్ర, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

## గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికల నేపథ్యంలో తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు.



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను ఇప్పటికే ప్రదర్శించామని తెలిపారు. ఈ జాబితాలపై అభ్యంతరాలను ఈ నెల 30వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. ఆ తరువాత సెప్టెంబర్ 2న గ్రామ పంచాయతీ, వార్డు వారీగా ఫోటోలతో కూడిన తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని స్పష్టం చేశారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా రాజకీయ పక్షాలు సహకరించాలని, ఓటరు జాబితాలు, పోలింగ్ కేంద్రాలపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా గడువులోగా సమర్పించాలని సూచించారు. అభ్యంతరాలను పరిశీలించి తుది జాబితాలో సవరణలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ రెడ్డి, ఎంఐఎం నాయకుడు మజార్, బీఆర్ఎస్ నేత కోరిపెల్లి రాంకిషన్ రెడ్డి, రమేష్, టీడీపీ రమేష్, వైఎస్ఆర్సీపీ నరేష్, ఆమ్ ఆద్మీ పార్టీ హైదర్, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం రోజున డీసీసీ సమావేశం







అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం రోజున డీసీసీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధ్యక్షతన బ్యాంకుల వారీగా పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపి, ఎన్ఎల్ఎం, పిఎం విశ్వకర్మ, కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్ (సిఐజి) పథకాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అగ్రికల్చర్ సెక్టర్ (క్రాప్ లోన్, అగ్రీటర్మ్లో, న్ అగ్రి ఇన్ఫ్రా, అగ్రి అన్సీలయరీ) కు సంబంధించి 1079.22 కోట్లు మొదటి త్రైమాసిక కాలంలో మంజూరు చేసినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పూర్తయిన యూనిట్ల వివరాలను తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న యూనిట్లకు గల కారణాలు బ్యాంకులవారీగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వెంటనే పెండింగ్లో ఉన్న యూనిట్ల సమస్యలను సత్వరమే పరిష్కరించి, రుణాలు మంజూరు చేయాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ లో కొత్త తరహా లోన్లు ఇవ్వాలన్నారు. జొన్నలు అధికంగా లభిస్తాయి కాబట్టి జొన్నలతో తయారయ్యే యూనిట్ ఏర్పాటు పై దృష్టి పెట్టాలన్నారు. మహిళా సంఘాలను స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ట్రైని కలెక్టర్ సలోని చాబ్రా, , ఆర్బిఐ ఎల్డిఓ ఎస్ రాములు, ఎల్డిఎం ఉత్పల్ కుమార్ దామ్, ఇండస్ట్రియల్ జిఎం పద్మభూషణ రాజు, డిఆర్డిఓ రాథోడ్ రవీందర్, డీఎంసీ శ్రీనివాస్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ అధికారి మనోహర్, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ శ్రీధర్, నాబార్డ్ అధికారులు, జిల్లా అధికారులు, బ్యాంకు మేనేజర్స్, సిఎఫ్ఎల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాసర వరద పరిస్థితిని స్వయంగా సమీక్షించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి నిర్మల్ జిల్లా బాసర ప్రాంతంలో గోదావరి నది నీటిమట్టం క్రమ క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ రాత్రికి రాత్రి అక్కడికి చేరుకొని వరద పస్థితిని సమీక్షించారు. ఈరోజు ఉదయమే బాసర గోదావరి తీరంలో మూడు లాడ్జిల్లో చిక్కుకుపోయిన కుటుంబాలను పరామర్శించారు. మళ్ళీ ఇప్పుడు సాయంత్రం వరద క్రమక్రమంగా పెరిగి గోదావరి నది నుండి ఆలయం దరిదాపుల్లోకి రావడం వల్ల హుటాహుటిన బాసర వెళ్ళి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఈ పర్యవేక్షణలో జిల్లా ఎస్పీ జి.జానకి షర్మిల ఐపీఎస్ తో పాటు భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఐపిఎస్,ముధోల్ ఇన్స్పెక్టర్ మల్లేష్, ఎస్ఐ శ్రీనివాస్,సిబ్బంది తదితరులు ఉన్నారు

## భైంసా సబ్ డివిజన్ లోని పలు ప్రాంతాల్లో ముమ్మర సహాయక చర్యలు చేపడుతున్న నిర్మల్ పోలీసులు

**బాసర గోదావరి నది ఘాట్ల వద్ద పోలీసుల నిరంతర గస్తీ**

**నీటి నిల్వలో చిక్కుకున్న ప్రజలను వేగంగా స్పందించి రక్షణ కల్పిస్తున్న పోలీసులు**

**24 గంటలు పోలీసు అధికారులు సిబ్బంది, ప్రజల భద్రత కొరకు క్షేత్రస్థాయిలో పని చేయాలి జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్**



అమృత్ తెలంగాణ ముధోల్ నియోజకవర్గ న్యూస్ భారీ వర్షాల కారణంగా భైంసా సబ్ డివిజన్ ప్రాంతాలైన బాసర, తానూర్, భైంసా గ్రామీణ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు నీటిలో మునిగిపోయాయి. ఎక్కడెక్కడ అయితే వర్షపు నీరు రోడ్ల మీదకు వచ్చిందో అక్కడ అంతా పోలీసులు ముమ్మర సహాయక చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా బాసర లోని పలు ప్రాంతాల్లో వర్షపు నీటిలో చిక్కుకున్న వృద్ధులు, మహిళలు, చిన్నారులను సురక్షిత ప్రదేశాలకు తరలించి వారి ప్రాణాలను రక్షించారు. రోడ్లపై నిలిచిన నీటిలో వాహనదారులు సురక్షితంగా వెళ్లేలా మార్గనిర్దేశం చేశారు. అంతేకాక బాసర గోదావరి నది ఘాట్ల వద్ద వరద ప్రవాహం పెరుగుతున్న దృష్ట్యా పోలీసులు నిరంతర గస్తీ నిర్వహిస్తున్నారు. ఘాట్ వద్దకు వచ్చే ప్రజలను అప్రమత్తం చేస్తూ, భద్రత కోసం అవసరమైన సూచనలు అందిస్తున్నారు. వాహనదారులు – పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో నిర్మల్ పోలీసులు తక్షణమే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు.అదే సమయంలో ట్రాఫిక్ స్తంభించకుండా అవసరమైన చోట ట్రాఫిక్ డైవర్షన్లు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీసులు 24 గంటలు క్షేత్రస్థాయిలో ప్రజలతోనే ఉంటూ, “ప్రజల భద్రతే లక్ష్యంగా సహాయక చర్యలు చేపడుతున్నారు.

## జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు



మీడియాతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : శుక్రవారం ఆమె ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్తో కలిసి భైంసా పట్టణంలోని రావుల్నగర్, ఆటోనగర్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గడ్డెన్న వాగు ప్రాజెక్టుకు ఇన్ఫ్లో అధికంగా రావడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలడం జరుగుతుందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటారని,హాఏవైనా ఇబ్బందులు తలెత్తితే 91005 77132 టోల్ ఫ్రీ నంబర్కు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిన కలెక్టర్, వరదల కారణంగా ఎవరూ ప్రవాహం నీటిలోకి వెళ్లకూడదని హెచ్చరించారు. ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. అనంతరం భైంసా మండలంలోని దేగామ వంతెనను కలెక్టర్, ప్రత్యేక అధికారి పరిశీలించారు. వంతెన పరిసర ప్రాంతాలలో వరద పరిస్థితులను గమనించారు. స్థానికులతో మాట్లాడుతూ వరద నీటిప్రమాదం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కుంటాల మండలంలోని అందకూరు బ్రిడ్జి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరదల వల్ల వంతెనలు, రహదారులు సర్వే చేపట్టడం జరుగుతుందని తెలిపారు. దెబ్బతిన్న చోట త్వరలోనే శాశ్వత మరమ్మత్తులు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్శనలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్కుమార్, ఆర్ అండ్ బి డిఈ సునీల్, మున్సిపల్ కమిషనర్ రాజేష్కుమార్, తహసీల్దార్ ప్రవీణ్తో పాటు అధికారులు పాల్గొన్నారు.

# వినాయకుడికి బోరంచు శ్రీకాంత్ రెడ్డి కుటుంబ సభ్యుల ప్రత్యేక పూజలు



కుటుంబ సభ్యులతో వినాయకునికి పూజలు చేస్తున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి స్వగ్రామం మావల లోని ఈశ్వర్ గణేష్ మండలి ప్రతిష్టించిన గణనాథుడికి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి ఆయన సోదరులు ప్రశాంత్ రెడ్డి ఇరువురు దంపతులు స్వామివారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి, భారీ గరిక మాలతో స్వామివారిని అలంకరించడం జరిగింది.

అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులతో పటు గణేష్ మండలి నిర్వాహకులు, భక్తులు పాల్గొనడం జరిగింది.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా (మేజర్ ధ్యాన్చంద్ జయంతి) జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం యన్.టి.ఆర్ మినీ స్టేడియంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత సంవత్సరం రాష్ట్ర స్థాయిలో జరిగిన సీయం కప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పథకాలు సాధించిన క్రీడాకారులను అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, మేజర్ ధ్యాన్చంద్ భారత క్రీడలకు చేసిన సేవలు అమోఘమని, ఆయన స్ఫూర్తితో ప్రతి క్రీడాకారుడు కృషి చేస్తే అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించడం సాధ్యమని అన్నారు. జిల్లాలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి క్రీడల శాఖ కృషి చేస్తుందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, క్రీడల వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు పాకాల రాంచందర్, ఒలింపిక్ అసోసియేషన్ కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పద్మనాభ గౌడ్, సాఫ్ట్బాల్ అసోసియేషన్ సెక్రటరీ అన్నపూర్ణ గౌడ్, ట్రస్మా అధ్యక్షులు చంద్ర గౌడ్, పెటా సెక్రటరీ భోజన్న, పెటా అధ్యక్షుడు భూక్యా రమేష్ తదితరులు క్రీడల ప్రాధాన్యాన్ని వివరించారు. జిల్లా వ్యాప్తంగా పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# బాసర తహశీల్ద్దార్.. ఎస్ఐ సేవలు భేష్



ముధోల్ :అమృత్ తెలంగాణ: గత మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురవడంతో బాసర మండలంలోని ఆయా గ్రామాల్లో వరద ప్రభావంపై బాసర తహసిల్దార్ పవన్ చంద్ర, ఎస్ఐ శ్రీనివాస్ ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి పలువురిచే శభాష్ అనిపించుకుంటున్నారు. ఒకపక్క బాసర పుణ్యక్షేత్రంలో బాసర గోదావరి ఉధృతి పెరగడంతో ముందు రోజు బాసర గోదావరి స్థాన ఘట్టాలను పరిశీలించారు. భక్తులు ఎవరిని అనుమతించవద్దని ముందే సూచించారు. దీంతో ఎవరి ని అటు వైపు అనుమతించలేదు. శుక్రవారం మహారాష్ట్రలో వర్షాలతో డ్యాములు నిండిపోయి గేట్లు తెరవడంతో బాసర గోదావరి ఉధృతంగా ప్రవహించింది. దీంతో బాసర సరస్వతి ఆలయం పరిసరాల వరకు వరద నీరు చేరింది. ఆలయ పరిసరాల్లో ఉన్న లాడ్జిలు పలు నివాస గృహాలు, దుకాణాల చుట్టూ భారీగా వరద నీరు చేరింది. దీంతో వెంటనే వరద నీటిలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాల తరలించడానికి పోలీస్ శాఖ , రెవెన్యూ శాఖ చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల కూడా బాసరను సందర్శించి వరదల్లో చిక్కుకున్న వారి కోసం ట్రాక్టర్ పై వేళ్ళి వారిని పరామర్శించారు. వెంటనే రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్ డి ఆర్ ఎఫ్) బృందం సభ్యులు బాసరకు చేరుకొని ప్రత్యేక బోట్ల ద్వారా వరధ నీటి లో చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చారు. బాసర తోపాటు బిద్రెల్లి వాగుతో పాటు గోదావరి పరివాహక ప్రాంతా గ్రామాలు ఉండటంతో గత రెండు రోజులుగా వరద నీరు పోటెత్తాడంతో తహసిల్దార్, ఎస్ఐ తన సిబ్బంది ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఒకపక్క ఎప్పటికప్పుడు వరద తీవ్రతను, సమస్యలను సబ్ కలెక్టర్ , జిల్లా కలెక్టర్ , ఎస్పీ, అడిషనల్ ఎస్పీకీ వివరిస్తూ , ఇక్కడి సమాచారం చేరవేశారు. గత రెండు రోజులుగా రెవెన్యూ , పోలీస్ శాఖ వారు నిరంతరం విధుల్లో ఉంటూ ప్రజలను అప్రమత్తం చేస్తూ, వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడటంపై సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది.

# బాసర గోదావరి ఉగ్రరూపం..



ముధోల్ : అమృత్ తెలంగాణ: గత మూడు రోజులుగా విస్తారంగా భారీ వర్షాలు కురియటంతో శుక్రవారం బాసర గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. మహారాష్ట్రలో వర్షాలు భారీగా కురవడంతో అక్కడ ఉన్న డ్యాంలు గేట్లు ఎత్తివేయడంతో బాసర గోదావరి ఉధృతితంగా ప్రవహిస్తుంది. దీంతో గోదావరి స్నానఘట్టాలు నీట మునిగి, సరస్వతి ఆలయంకు వేళ్ళే రోడ్లు,లాడ్జిలు , నివాస గృహాలు వరకు నీళ్ళు చేరాయి.దీంతో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, శుక్రవారం బాసర ను సందర్శించారు. నివాస గృహాల్లో, లాడ్జిల్లో ఉన్నవారిని ప్రత్యేక బోట్ల సాయంతోసురక్షిత ప్రాంతానికి తరలించారు. సాయత్రం వరకు గోదావరి ఉధృతి ఇంకా భారిగా కొనసాగుతూనే ఉంది. ఇంత ఉధృతంగా గోదావరి ప్రవహించటం 1983 సంవత్సరంలో జరిగిందని బాసర వాసులు పేర్కొంటున్నారు. గోదావరి ఉధృతిని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, నిజాంబాద్ జిల్లా ప్రజలు గోదావరి బ్రిడ్జిపై నుండి తిలకిస్తున్నారు. దీంతో సందర్శకుల తాకిడి పెరిగింది. దీంతో బాసర ఎస్ఐ శ్రీనివాస్, పోలిస్ సిబ్బంది గోదావరి పరిసరాల కు సందర్శకులను అనుమతించడం లేదు. దూరం నుంచి గోదావరి ప్రవాహంను సందర్శకులు తిలకిస్తున్నారు. గోదావరి అటు వైపు నిజామాబాద్ రూరల్ సిఐ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలోనవిపేట్ ఎస్ఐ తిరుపతి పరిస్థితి ని పర్యవేక్షించారు. గోదావరి ఉధృతి రేపటి వరకు కొనసాగనుంది.

# గోదావరి ఉధృతిలో చిక్కుకున్న కార్మికులను కాపాడిన రెస్క్యూ టీం




ముధోల్ అమృత్ తెలంగాణ: బాసర గోదావరి ఉధృతిలో రైల్వే స్టేషన్ ట్రాక్ సమీపంలో ఉన్న శివారులో ఓ అధికారి వ్యవసాయ క్షేత్రంలో చిక్కుకున్న వ్యవసాయ కార్మికులు ఇద్దరిని రాష్ట్ర విపత్తు ప్రతి స్పందన దళం(ఎస్ డిఆర్ ఎఫ్) బృందాలు శుక్రవారం సాయంత్రం కాపాడారు. వ్యవసాయ పనుల కోసం వెళ్లిన కార్మికులు సువర్ణ రాజు, బుచ్చయ్యలు వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్నారు. ప్రతిరోజు వెళ్లినట్లే పనికి వెళ్లారు. అయితే గోదావరి ఉధృతి భారీగా పెరగడంతో వెంటనే తమ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు . ఈ సమాచారం బాసర తాసిల్దార్ పవన్ చంద్ర , బాసర ఎస్సై శ్రీనివాసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ డి ఆర్ఎఫ్ బృందాలు లకు సమాచారం అందించారు.వారు వేంటనే ప్రత్యేక బోట్ ద్వారా వేళ్ళిరెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ఈ రెస్క్యూ ఆపరేషన్ ను బైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, ముధోల్ సీఐ మల్లేష్, తహశీల్దార్ పవన్ చంద్ర దగ్గరుండి పర్యవేక్షించారు. వ్యవసాయ క్షేత్రంలో చిక్కుకున్న కార్మికుల దగ్గర కు చేరుకోని లైఫ్ జాకెట్ లను ఎస్ డిఆర్ఎఫ్ బృందం సభ్యులుఅందించారు.కార్మికులతో పాటు వారు పెంచుకున్న రెండు పెంపుడు కుక్కలను కూడా బోట్లో కూర్చోబెట్టుకొని సురక్షిత ప్రాంతాంమైన రైల్వే ట్రాక్ వరకు చేర్చారు. దీంతో బాధితులు పోలీసులకు, రెవెన్యూ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు . ఈ సందర్భంగా కార్మికులను కాపాడిన ఎస్డిఆర్ఎఫ్ బృందం సభ్యులను అడిషనల్ ఎస్పి అభినందించారు.

# గంగమ్మ గుడి నిర్మాణానికి మాజీ జడ్పిటిసి రూ.51వేలు విరాళం



గాంధారి :అమృత్ తెలంగాణ: గాంధారి మండల కేంద్రంలోని గంగమ్మ గుడి నిన్నటి భారీ వరదలకు గంగమ్మ గుడి కొట్టుకపోయింది. అమ్మవారి విగ్రహాలు కొద్ది దూరంలో వెలిశాయి. దీని గమనించిన గంగపుత్ర సంఘం సభ్యులు అమ్మవారి విగ్రహాన్ని వెలికి తీసి పూజలు నిర్వహించారు విషయం తెలుసుకున్న గాంధారి మాజీ జెడ్పిటిసి సభ్యుడు తానాజీ రావు గంగమ్మ వెలసిన స్థలాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి రూ. 51000 విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం మండల అధ్యక్షుడు బెస్త నవీన్. సభ్యులు నారాయణ, మధు, సంగయ్య, ఆగమయ్య తదితరులు పాల్గొన్నారు.

# రుహాని టాలెంట్ గుర్తించాల్సిందే..!



చి.ల.సౌ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన భామ రుహాని శర్మ. ఆ సినిమాలో స్ట్రాంగ్ ఉమెన్ గా రుహాని నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఒక్క మూవీతోనే యూత్ లో రుహానికి మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఇక ఆ తర్వాత రుహాని హిట్ సినిమాలో కూడ నటించింది. శైలేశ్ డైరక్షన్ లో విశ్వక్ సేన్ హీరోగా వచ్చిన హిట్ మూవీ కూడా అమ్మడి ఖాతాలో మరో హిట్ పడేలా చేసింది. ఆ తర్వాత డర్టీ హరి నూటొక్క జిల్లాల అందగాడు సినిమాల్లో కూడా నటించింది ఈ భామ. ఇక్కడే కాకుండా బాలీవుడ్ లో మ్యూజిక్ వీడియోలో కూడా రుహాని అదరగొట్టేసింది. ప్రస్తుతం ఆగ్రా మీట్ క్యూట్ సినిమాల్లో నటిస్తున్న రుహాని శర్మ గ్లామర్ షో చేయడంలో మాత్రం వెనకడుగు వెయట్లేదు. అమ్మడు చేస్తున్న ఈ షోకి రోజు రోజుకి తన ఫాలోవర్స్ పెరుగుతూ వస్తున్నారు. స్కిన్ షోలో నావెల్టీని జోడీస్తూ రుహాని చేస్తున్న ఫోటో షూట్ కి ప్రత్యేక ఆకర్షణ అవుతున్నారు నెటిజెన్లు. అంతేకాదు లేటెస్ట్ గా ఓ సాంగ్ కి డ్యాన్స్ చేస్తూ వీడియో చేసింది అమ్మడు. ఆ వీడియోని తన ఇన్ స్టా రీల్స్ లో షేర్ చేసింది. ఛాన్స్ దొరికితే ఎలాగోలా ప్రేక్షకులను మెప్పించాలని చూస్తున్న రుహాని శర్మ ప్రయత్నాలు వర్క్ అవుట్ అవుతున్నాయని చెప్పొచ్చు. అందం అభినయం రెండు కలగలిపి ఉన్న రుహానికి ఇంకా ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదని చెప్పొచ్చు. తనకి ఇచ్చిన పాత్రలో మెప్పిస్తూ వస్తున్న రుహాని శర్మ స్టార్ సినిమా ఛాన్సుల కోసం ఎదురుచూస్తుంది. లేటెస్ట్ ఇన్ స్టా రీల్స్ తో సోషల్ మీడియాలో వైరల్ గా మారిన రుహాని శర్మ.

# ఈ వెయిటింగ్ దేనికోసం అమ్మడు..?




రెండు బ్యాక్ టు బ్యాక్ హిట్లతో మృణాల్ అదరగొట్టగా ఇక టాలీవుడ్ లో అమ్మడికి తిరుగులేదని అనుకున్నారు. సీతారామం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మెప్పించిన బ్యూటీ మృణాల్ ఠాకూర్ అంతకుముందు బాలీవుడ్ సీరియల్స్ తో పాటు సినిమాలు కూడా చేసినా రాని క్రేజ్ అమ్మడికి సీతారామం తో వచ్చింది. సినిమాలో సీతామహాలక్ష్మి, నూర్జహాన్ పాత్రల్లో మృణాల్ అదరగొట్టేసింది. టాలీవుడ్ కి మరో స్టార్ హీరోయిన్ వచ్చిందని అందరు ఫిక్స్ అయ్యారు. సీతారామం తర్వాత నానితో హాయ్ నాన్న సినిమా చేసింది అమ్మడు. ఆ సినిమాలో కూడా తన నటనతో ఇంప్రెస్ చేసింది. రెండు బ్యాక్ టు బ్యాక్ హిట్లతో మృణాల్ అదరగొట్టగా ఇక టాలీవుడ్ లో అమ్మడికి తిరుగులేదని అనుకున్నారు. సూపర్ ఛాన్స్ కొట్టేసిన శివానీ కానీ విజయ్ దేవరకొండతో చేసిన ఫ్యామిలీ స్టార్ సినిమా డిజప్పాయింట్ చేసింది. ఆ సినిమా హిట్ అయితే పరిస్థితి ఎలా ఉండేదో కానీ ఆ సినిమా ఫ్లాప్ అవ్వడం వల్ల మృణాల్ కెరీర్ రిస్క్ లో పడింది. రెండు హిట్లు పడినప్పుడు కాదు ఒక్క ఫ్లాప్ పడగానే బ్యాడ్ లక్ వెంటాడుతుంది. అందుకే తెలుగులో అమ్మడికి చేతిదాకా వచ్చిన సినిమాలు చేజారిపోయాయి. పోనీ బాలీవుడ్ లో ఏమైనా వరుస ఆఫర్లు ఉన్నాయా అంటే అక్కడ అరకొర అవకాశాలే తప్ప పెద్దగా ఛాన్స్ లు రావట్లేదు. ఐతే తెలుగులో కొన్ని ఆఫర్లు వస్తున్నా కూడా మృణాల్ వాటిని వెయిటింగ్ లో పెట్టినట్టు తెలుస్తుంది. మరి కెరీర్ అటు ఇటుగా ఉన్నప్పుడు కూడా ఈ వెయిటింగ్ లు గట్రా దేనికన్నది అర్థం కావట్లేదు. ఐతే ఒక ఆఫర్ కి ఓకే చెప్పాక దానికంటే బెటర్ ఆఫర్ వస్తే కష్టం కదా అని మృణాల్ భావిస్తుంది. ఐతే అలా వెయిట్ చేస్తూ ఆఫర్లను హోల్డ్ లో పెడుతూ వస్తే ఇక ఉన్న ఆ ఒక్క ఛాన్స్ కూడా చేజారే అవకాశం ఉంటుంది. కథల విషయంలో నచ్చక వెయిట్ చేయడం మంచి విధానమే కానీ మరీ మృణాల్ ఠాకూర్ ఇలా రెండు హిట్లు ఒక ఫ్లాప్ పడగానే డీలా పడిపోవడం ఆమె ఫ్యాన్స్ ని కన్ ఫ్యూజ్ చేస్తుంది. మృణాల్ మళ్లీ తిరిగి తెలుగులో వరుస సినిమాలు చేయాలని ఆమె ఫాలోవర్స్ కోరుతున్నారు. ఐతే సినిమాల పరంగా దూరంగా ఉంటున్నా అమ్మడు ఫోటో షూట్స్ తో ఆడియన్స్ కు రెగ్యులర్ గా టచ్ లోనే ఉంటుంది. తప్పకుండా మృణాల్ కి మళ్లీ మంచి అవకాశాలు రావాలని ఆమె ని ఇష్టపడే ఆడియన్స్ కోరుతున్నారు.

# అమ్మకు అచ్చు గుద్దిన అందం హీరోయిన్గా!



కోలీవుడ్ లో ఇప్పటికే మామ్ క్రేజ్ తో కొంత మంది భామలు హీరోయిన్లగా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కోలీవుడ్ లో ఇప్పటికే మామ్ క్రేజ్ తో కొంత మంది భామలు హీరోయిన్లగా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. రాధ కుమార్తెలిద్దరు కార్తీక, తులసి ఇద్దరు ఎంట్రీ ఇచ్చారు. కానీ ఇండస్ట్రీలో వాళ్లు సక్సెస్ కాలేదు. కొన్ని సినిమాలు చేసి వెనుదిరిగారు. అలాగే యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తె ఐశ్వర్య కూడా లాంచ్ అయింది. కానీ ఆమె కూడా నిలదొక్కుకోలేకపోయింది. వివాహం చేసుకుని ఓఇంటిదైంది. కార్తిక కూడా పెళ్లి చేసుకుని స్థిరపడింది. ఇలా కెలికితే కొంత మంది భామల పేర్లు తెరపైకి వస్తాయి. అయితే ఇప్పుడా సెంటిమెంట్ ని బ్రేక్ చేస్తూ ముందకు సాగాల్సిన బాధ్యత ఈ నయ వారసురాళ్లపై ఉంది. సుందర్ .సి-ఖుష్బూలకు ఇద్దరు అందమైన కుమార్తెలు అవంతిక, ఆనందిత ఉన్నారు. అవంతిక అయితే అచ్చంగా అమ్మనే పోలి ఉంటుంది. ఖుష్బూ నోట్లో నుంచి ఊడిపడినట్లే ఉంటుంది. ఇటీవలే ఇద్దరు చదువులు కూడా పూర్తి చేసారు. ఈ నేపథ్యంలో అవంతిక మ్యాకప్ వేసుకోవడానికి రెడీ అవుతోంది. తాజాగా అమ్మడు ఓ ఫోటోషూట్ లో పాల్గొంది. బ్రౌన్ కలర్ బ్లౌజ్ పై షర్ట్ ధరించి నేలపై కూర్చుని కెమారాకి వివిధ భంగిమల్లో ఫోజులిచ్చింది. కవ్వించే కిల్లర్ లుక్ లో కట్టిపడేసింది. అమ్మడి ఎదపై సొగసైన టాటూ తో వావ్ అనిపించింది.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు



అన్వేషి జైన్ హాట్ ఇన్ వైట్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309, ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com